# ప్రజాశక్తి

మంగళవారం 28 మే 2024

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

# నీరే గరళం..!!

* కలుషిత నీరు తాగి పది రోజుల్లో ముగ్గురు మృతి
* 15 మందికి అస్వస్థత
* వివిధ ఆస్పత్రుల్లో చికిత్స

మృతుడు దుర్గారావు

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరంలో కలుషిత మంచినీరు తాగి గత పది రోజుల్లో ముగ్గురు మరణించారు. సుమారు 15 మంది వాంతులు, వీరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై నగరంలోని పలు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 7, 6వ డివిజన్ల పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పైప్‌లైన్ల లీకేజీలు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయకపోవడం కారణంగా దుర్వాసన, కలుషిత, మట్టివాసనతో కూడిన మున్సిపల్ నీటిని తాగిన కారణంగా ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. ఏడో డివిజన్ మొగల్రాజపురం చంద్రరాజేశ్వరరావు నగర్ నివాసి శిఖా ఇందిర (40) వాంతులు, వీరోచనాలతో చికిత్స పొందుతూ నాలుగు రోజులక్రితం మృతిచెందారు. ఇదే డివిజన్‌లోని బోయపాటి మాధవరావు వీధిలో నివాసముంటున్న వల్లూరి దుర్గారావు (46), కాకర్లమూడి ఇందిరా (55) వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరికొందరు వాంతులు, వీరోచనలతో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కొవ్వారపు రాజు, పటమట వారి వీధికి చెందిన పటమట శాయి సుధాకర్, పటమట వరలక్ష్మీ, జిజ్జవరపు తిరుపతమ్మ, నాగేశ్వరరావు (భార్యాభర్తలు), దావులూరి శ్రీనివాసరావు, వడ్లమాను లక్ష్మీ తిరుపతమ్మ, భాస్కర శర్మ, (కనకదుర్గగుడి పూజారి), అల్లాడ ఉమాదేవి, చంద్రమౌళి (6వ డివిజన్), ముండ్రు జయలక్ష్మీ, నవీన్ (తల్లీ, కొడుకు), ఇంకా పలువురు వాంతులు, విరోచనాలతో పలు ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు.

**దుర్గారావు మృతదేహాన్ని సందర్శించిన సిపిఎం నాయకులు**

వాంతులు, వీరోచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన వల్లూరి దుర్గారావు మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, నాయకులు మురహరి తదితరులు సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలుషిత నీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విఎంసి అధికారులను డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతున్న పటమట వరలక్ష్మీ

కలుషిత నీటిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

# కౌలు రైతు కష్టాలు

* కౌలు ఒప్పందాలు ప్రారంభం
* గత ఏడాదికన్నా అదనం
* మినుము ధరలు చూపి కౌలు పెంచిన భూ యజమానులు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

మూలిగేనక్కపై తాటిపండు పడిన చందంగా మారిపోయింది కౌలు రైతుల పరిస్థితి. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ విధానాలతో నష్టాలు మూటగట్టుకుని అప్పులు పాలవుతున్న కౌలు రైతులకు ఈ ఏడాది ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. ఖరీప్ సీజన్ ముంచుకొస్తున్నా ఎన్నికల కోడ్ కారణంగా కౌలు రైతుల గుర్తింపు, పంట సాగు ధృవీకరణ పత్రాల (సిసిఆర్‌సి) పంపిణీ ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదు. మరోపక్క మార్కెట్లో మినుము ధరలు అధికంగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని భూ యజమానులు ముందుగానే కౌలు ధరలను అమాంతంగా పెంచేశారు.

ఖరీఫ్ పంటల సాగుకు రైతులు, కౌలు రైతులు సమాయత్తం అవుతున్నారు. పంటల సాగుకు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్లో 4 లక్షల 27 వేల 294 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతాయని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. అత్యధికంగా 4 లక్షల 10 వేల 925 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. కౌలు రైతులే మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నీటి లభ్యత, రవాణా సౌకర్యం, భూ సారం తదితరాల ఆధారంగా భూములకు కౌలు చెల్లిస్తారు. రెండు పంటలు పండే భూములకు (ఖరీఫ్‌లో వరి, రబీలో మినుము) ఎకరాకు 75 కిలోల ధాన్యం బస్తాలు 17 నుంచి 23 వరకు కౌలుగా చెల్లిస్తారు. పంట పండిన తర్వాత ధాన్యం రైతు పేరుతో ఆర్‌బికెల్లో విక్రయించి కౌలు పోను మిగిలిన నగదును కౌలు రైతులు తీసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో ముందుగానే నగదు రూపంలో ఎకరాకు రూ.20 వేల నుంచి 25 వేలు కౌలు చెల్లింపులు జరుగుతాయి.

**మినుము, మెట్ట పంటల ధరలు చూపి కౌలు పెంపు**

ఖరీఫ్లో వరి సాగైన నల్లరేగడి సారవంతమైన మాగాణుల్లో రబీలో మినుము, పెసర సాగు చేస్తారు. మొదటి పంట వరి కౌలు చెల్లింపులకు, పెట్టుబడి ఖర్చులకు పోతుంది. రెండో పంటలో సాగైన మినుము, పెసలు పంటల ద్వారా ఆదాయం వస్తుంది. కౌలు రైతు కుటుంబాలు చేసిన రెక్కల కష్టం మిగులుతుంది. అయితే నాలుగేళ్ల తర్వాత మినుములకు మార్కెట్లో మంచి ధర లభించింది. క్వింటా మినుము రూ.9,500 వరకు పలుకుతోంది. గత కొన్నాళ్లుగా నష్టాలు మిగిల్చిన పసుపు, కంద పంటలకు మార్కెట్లో ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే ఈ పంటల ధరలు సాకుగా చూపి కౌలు ధరలను భూ యజమానులు పెంచేశారు. రెండో పంట అపరాలు పండే భూములకు ఎకరాకు రెండు బస్తాల నుంచి మూడు బస్తాల వరకు కౌలు ధరలు పెరిగాయి. ధాన్యం బస్తాకు కనీస మద్దతు ధర రూ.1630 వరకు ఉంది. దీన్ని నగదులో లెక్కిస్తే గతంలో ఎకరాకు రూ.32 వేలున్న కౌలు ఇప్పుడు రూ.35 నుంచి 36 వేలకు పెరుగుతోంది. ఎకరాకు రూ.3 వేల నుండి రూ.4 వేల వరకు కౌలు ధరలు పెరిగాయి. మినుము పండని క్షారభూముల కౌలు ఒప్పందాలు యథావిధిగానే 12 నుంచి 15 బస్తాల చెల్లించేలా ఒప్పందాలు జరుగుతున్నాయి.

**పోటీ పడి కౌలు పెంచొద్దు !**

**పంచకర్ల రంగారావు, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి**

పంటల సాగులో ఎరువులు, పురుగు మందులు, ఇతర పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. పంటలు పండించడం ద్వారా కౌలు రైతులకు ఒక ఏడాది మిగిలితే నాలుగేళ్లు నష్టపోతున్నారు. అప్పుల్లో మునిగిపోతున్నారు. గత ఏడాది సాగైన మినుము, పసుపు, కంద పంటల ధరలు మార్కెట్లో ఆశాజనకంగా ఉన్నాయని చెప్పి భూ యజమానులు కౌలు రేట్లు పెంచుతున్నారు. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులు అప్రమత్తం అవ్వాలి. పోటీపడి కౌలు ధరలు పెంచొద్దు.

సూరంపల్లి వచ్చిన సిపిఎం పోలవరం నిర్వాసితుల పాదయాత్రలో పాల్గొన్న సీతారామయ్య (వృత్తంలో పాతచిత్రం)

## సిపిఎం నాయకులు సీతారామయ్యకు పలువురు నేతల నివాళి

(వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ 2వ పేజీలో)

సీతారామయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

## కారులో వచ్చి దోపిడీకి యత్నం ?

**పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు**

**ప్రజాశక్తి - భవానీ పురం :** భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ ఘటనలో తాడేపల్లికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు. సిఐ పథనం ప్రకారం...ఇబ్రహీంపట్నం మండలం సూరాయిపాలెంలో దోపిడీకి యత్నం జరిగింది. ఈనెల 25వ తేదీ రాత్రి తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ నుండి ఓ మహిళతోపాటు నలుగురు వ్యక్తులు కారులో వస్తుండగా, మరో కారులో వారిని వెంబడించిన ముఠా దోపిడీకి పాల్పడింది. మిర్యాలగూడ నుండి వస్తున్న కారును తాడేపల్లికి చెందిన ముఠా అడ్డగించి వారి వద్ద నుండి రూ.20 వేలు దోచుకున్నారు. ఆరుగురు నిందితులను అదుపులోకి లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు. పూర్తి వివరాలు విచారణ తర్వాత మీడియాకు వెల్లడిస్తామని చెప్పారు.

**నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు ?**

మరోవైపు నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్న ముఠా వ్యవహారం రట్టయియినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం

(మిగతా 2లో)

## ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి మీనా

**ప్రజాశక్తి - విజయవాడ :** ఎన్‌టిఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు, పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకష్ణ, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, విజయవాడ సెంట్రల్ ఆర్‌వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం జూపూడిలోని నోవా, నిమ్రా కళాశాలల్లో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టేందుకు ఇప్పటికే చేసిన, చేస్తున్న ఏర్పాట్లను మీనా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్‌వో కె.మాధవి, నందిగామ ఆర్‌వో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, విజయవాడ తూర్పు ఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, విజయవాడ పశ్చిమ ఆర్‌వో ఇ.కిరణ్మయి పాల్గొన్నారు.

జూపూడిలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, చిత్రంలో డిల్లీరావు, సంపత్‌కుమార్ తదితరులు

## సిపిఎం నాయకులు సీతారామయ్యకు పలువురు నేతల నివాళి

**ప్రజాశక్తి - గన్నవరం :** సిపిఎం కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామ నాయకులు, ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ మల్లంపాటి సీతారామయ్యకు పలువురు నేతలు నివాళు లర్పించారు. ఆయన సోమవారం తెల్లవారుజామున అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. సూరంపల్లిలో సీతారామయ్య అంతిమయాత్ర నిర్వహించి గ్రామ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు పిన్నమనేని మురళీకృష్ణ, కాట్రగడ్డ స్వరూపరాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.వి.లక్ష్మణస్వామి, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు తదితరులు ఆయన అంతిమయాత్రలో పాల్గొని పాడెమోశారు. డాక్టర్ బి.హెచ్.శివరాం, పిన్నమనేని విజయ, బి.తాతబ్బాయి, మీరాఖాన్, గుంటక వెంకటరెడ్డి, జి.వి.రంగారెడ్డి, పులపాక రమేష్, బి.ఏడుకొండలు, సోమిశెట్టి శ్రీనివాసరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, ఉయ్యూరు అంజియ్య, నాగు, వెంకటస్వామి, ఉదయబాస్కర్ తదితరులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

**పలువురు నేతల నివాళి**

సీతారామయ్య భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, చౌటపల్లి రవి, మండల నాయకులు కైలే ఏసుదాసు, దాసి బాబూరావు, బడుగు మరియదాసు, గ్రామ నాయకులు సోమిశెట్టి శ్రీనివాసరావు, శీను, గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు సీతయ్య, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ సంతాపం**

సీతారామయ్య మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఆయనకు విప్లవ జోహార్లర్పించింది. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు ఓ ప్రకటన విడుదల చేశారు.

**ఓట్ల లెక్కింపుపై సమీక్ష**

ప్రజాశక్తి - విజయవాడ : జూన్ 4న ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డిల్లీరావు... ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు వివరించారు. అన్ని రాష్ట్రాల సిఇఒలు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాల ఎన్నికల అధికారులతో సోమవారం ఢిల్లీ నుండి ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సంధుతో కలిసి రాజీవ్ కుమార్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టరేట్ నుండి డిల్లీరావు, జెసి డా.పి. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## కారులో వచ్చి దోపిడీకి యత్నం ?

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ఈ ప్రచారం ప్రకారం...గుంటూరు జిల్లా తాడేపల్లి సీతానగరంనకు చెందిన ముఠా నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్నారు. ఈముఠా రూ.లక్ష అసలు నోట్లు ఇస్తే రూ.3 లక్షల విలువైన నకిలీ నోట్లు ఇస్తామని తెలంగాణలోని మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన వారితో ఒప్పందం చేసుకుంది. శనివారం మిర్యాలగూడలో అసలు నోట్లు తీసుకుని కారులో విజయవాడ బయలుదేరిన వారిని తాడేపల్లి ముఠా వెంబడించింది. విజయవాడ సమీపంలోని సూరాయిపాలెం వద్దకు వచ్చి ఇరువైపుల మాట్లాడుకుంటున్న సమయంలో ఆకస్మికంగా పోలీస్ స్టిక్కర్ ఉన్న తెల్లటి స్కార్పియో కారులో కొందరు వ్యక్తులు వచ్చి పోలీసుల పేరుతో హడావుడి చేశారు. ఈవ్యవహారాన్ని స్థానికులు గుర్తించి ప్రశ్నించడంతో పోలీసుల పేరుతో హడావుడి చేసినవారిలో కొందరు స్కార్పియో కారులో పరారయ్యారు. బెలేరో కారును వదిలేశారు. దీంతో ఖంగుతిన్న మిర్యాలగూడ వాసులు ఏం చేయాలో పాలుపోక తామూ ఆస్పత్రికి వెళు తుండగా వెంబడించి దోపిడీకి ప్రయత్నించారని ఫ్లేటు ఫిరాయించినట్లు తెలిసింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి నకిలీ పోలీసులు వదిలి వెళ్లిన కారును స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ కరెన్సీ వ్యవహారం గురించి తెలుసుకున్నారు. మిర్యాలగూడ వారు తప్పుడు సమాచారం ఇచ్చారని గుర్తించారు. మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిలో గతంలో నకిలీ కరెన్సీ కేసులో అరెస్టయిన ఓ నిందితుడు కూడా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ కేసును నీరుగార్చేందుకు గతంలో విజయవాడ సిసిఎస్‌లో పని చేసిన ఓ ఏఎస్ఐగా విశ్వప్రయత్నాలు చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ద్వారకా తిరుమలలో వెలంపల్లి దంపతులు పూజలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విజయవాడ పశ్చిమ ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు దంపతులు సోమవారం ద్వారక తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సిఎం జగన్మోహనరెడ్డి, వైసిపికి దీవెనలు ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

## బాలికపై అత్యాచారయత్నం కేసులో మేనమామకు జైలు

**ప్రజాశక్తి - విజయవాడ :** బాలికపై అత్యాచారయత్నం కేసులో ముద్దాయికి ఐదేళ్ల కఠినకారాగారా శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ బాలికపై విజయవాడ వన్‌టౌన్ మల్లికర్జున పేటకు చెందిన ఆమె మేనమామ అత్యాచారయత్నం చేశాడు. ఈ మేరకు బాలిక తల్లి 2018 జనవరి 9న వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సిఆర్ నెంబరు 07/2018 యు/ఎస్ 376 ఆర్/డబ్ల్యు 511, 506 ఐపిసి అండ్ సెక్షన్ 8 ఆఫ్ పోస్కో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. అప్పటి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ డి.కాశీవిశ్వనాథ్ మరుసటి రోజునే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి విచారణ జరిపారు. దర్యాప్తు అనంతరం చార్జిషీటు ఫైల్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువుకావడంతో సోమవారం విజయవాడ పోస్కో కోర్ట్ ఇన్చార్జి జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగి రెడ్డి, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, అప్పటి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ డి.కాశీ విశ్వనాథ్, సిబ్బంది పర్యవేక్షణలో ఏడుగురు సాక్షులను విచారించారు.

## దోపిడీ కేసులో ఏడాది జైలు

**ప్రజాశక్తి - విజయవాడ :** దోపిడీ కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైం.నెం.852/2021 సెక్షన్ 392 ఐపిసి కేసులో ముద్దాయైన విజయవాడ భానునగర్‌కు చెందిన సింహరాతి హెబెలు అలియాస్ పటేల్‌పై నేరం రుజువు కావడంతో సోమవారం రెండో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎ.బి.అప్పారావు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. 2021 డిసెంబరు 10వ తేదీన ప్రకాశం జిల్లా మార్కాపురంనకు చెందిన వ్యక్తిని బెదిరించి, డబ్బులు, బైక్‌ను తీసుకుని పరారైన కేసులో హెబెలు అలియాస్ పటేల్‌పై నేరం రుజువుకావడంతో సోమవారం రెండో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎ.బి.అప్పారావు ఏడాది జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.గీతా, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, అప్పటి కృష్ణలంక ఎస్ఐ కృష్ణ బాబు, సిబ్బంది పర్యవేక్షణలో 16 మంది సాక్షులను విచారించారు.

## తొలి ప్రధాని నెహ్రూకు నివాళి

**ప్రజాశక్తి - విజయవాడ :** తొలి ప్రధాని, భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయనకు ఘన నివాళి అర్పించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఎపిసిసి ఉపాధ్యక్షులు వి.గురునాథం, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ముందస్తు తనిఖీలు

**ప్రజాశక్తి - విజయవాడ :** జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా డిసిపి హరికృష్ణ, నార్త్ ఎసిపి ఆధ్వర్యాన సోమవారం రైల్వే స్టేషన్, పార్శిల్ ఆఫీసు ఏరియా పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్, రైల్వే ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది, వెస్ట్ డివిజన్లోని వన్‌టౌన్, టూటౌన్ పిఎస్ ఇన్‌స్పెక్టర్లు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే పరిసర ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, లాడ్జీలు, డార్మెంటరీలను తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన వారిని ఐరిష్ వాహనం సహాయంతో వారిపై గల కేసులు వివరాలు తెలుసుకున్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి - విజయవాడ :** తోట వారి స్ట్రీట్ ఫీడర్ మరమ్మత్తుల కారణంంగా మంగళవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు తోట వారి స్ట్రీట్, వైఎస్సార్ రోడ్, సిద్దార్థ స్ట్రీట్, సాగి హనుమమంతరావు స్ట్రీట్, వినాయక కాలనీ, భారత మాత కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## 30 మందికి జైలు శిక్ష, జరిమానా

**ప్రజాశక్తి - విజయవాడ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 30 మందికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. సోమవారం 1వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 30 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను సంబంధిత రైల్వే కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆర్.వి.శర్మ ముగ్గురికి ఒక్కొక్కరికి మూడు రోజులపాటు జైలు శిక్ష, మిగిలిన ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

## కెయులో ఓట్లు లెక్కించే రూమ్‌లు ఇవే...

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి :** కృష్ణాజిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపునకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రూమ్‌లను కేటాయించారు. రూమ్ నెంబరు 301ఎలో గన్నవరం అసెంబ్లీ, రూమ్ నెంబరు 101ఎలో గుడివాడ, రూమ్ నెంబరు 134ఎలో పెడన, రూమ్ నెంబరు 118ఎలో మచిలీపట్నం, రూమ్ నెంబరు 322బిలో అవనిగడ్డ, రూమ్ నెంబరు 129ఎలో పామర్రు, రూమ్ నెంబరు 201లో పెనమలూరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## 28న పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై శిక్షణ

**ప్రజాశక్తి - విజయవాడ :** పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై ఈనెల ఈనెల 28న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. డిల్లీరావు తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ ముందుగా మొగల్రాజపురంలోని పిబి సిద్దార్థ కళాశాల ఆడిటోరియంలో జరుగుతుందని ప్రకటించారని, అయితే వేదిక మార్పు జరిగిన విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

# రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పి

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

**ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్ :** వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని కృష్ణాజిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి పరిశీలించారు. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడూరుపాడు హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదానికి గల కారణాలు, మరణించిన వారి సమాచారాన్ని ఎస్పి అడిగి తెలుసుకున్నారు. తమిళనాడుకు చెందిన స్వామినాథన్ తన కుటుంబ సభ్యులతో కొవ్వూరు నుండి తమిళనాడు కారులో వెళ్తుండగా, కోడూరుపాడు పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ముందుగా వెళుతున్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్ను ఢీ కొట్టారు. అనంతరం అవతలి వైపు ఎదురుగా ఉన్న రోడ్డులో వస్తున్న వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో వారి ప్రయాణిస్తున్న కారు నుజ్జునుజ్జయింది. దీంతో స్వామినాథన్, ఆయన ఇద్దరు పిల్లలు, వారి బంధువు ఒకరు సంఘటన స్థలంలోనే మరణించారు. స్వల్ప గాయాలతో స్వామినాథన్ భార్య ప్రాణాపాయం నుండి బయటపడింది. ఆమెని వెంటనే పోలీస్ సిబ్బంది విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. .

**పాస్‌పోర్ట్ పోయినది**

ఎన్.టి.ఆర్. జిల్లా, తిరువూరు మండలం, నడిం తిరువూరు కాపురస్తులు షేక్ మొహిద్దీన్ గారి కుమారుడు నైన ముజీబ్ అను నాకు VSPA 05519795 నెంబరు గల పాస్‌పోర్ట్ ఉన్నది. ఇట్టుండగా సదరు పాస్‌పోర్ట్‌ను తీసుకుని ది.30.04.2024వ తేదీన ఫోటోస్టాట్ తీయించే నిమిత్తము తిరువూరు మెయిన్ రోడ్డులో వెళ్ళుచుండగా మార్గమధ్యలో సదరు సదరు పాస్‌పోర్ట్ ఎచ్చటనో పోయినది. నేను చుట్టు ప్రక్కల విచారించిననూ సదరు పాస్‌పోర్ట్ జాడ తెలియరాలేదు. సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయగలరు.

నెం : 9133801998

IN THE COURT OF THE HONBLE FAMILY COURT JUDGE, RANGA REDDY DISTRICT, AT :: L.B.NAGAR
O.P.No. 1501 OF 2023

Between:
Vinnakota Vanaja W/o V.Brahamananda Rao Age: 52 years, Occ: Tailoring, R/O: Flat.No.1404, 4 th Floor, Janapriya colony, Satyanagar, Kothapet, R.R.District-500035.
...Petitioner/Petitioner
AND
Vinnakota Brahamananda Rao S/o V.RajaRao Age: 54 years, Occ: Lorry driver, R/o: H.No.41-27-50, Marwadi temple, Krishanlanka, Vijayawada (Urban), Krishna district, Andhrapradesh-520013.
... Respondent/Respondent

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed FCOP NO. 1501 of 2023 against you (Respondent) seeking the relief of Divorce and the same is posted for your appearance on 10.06.2024. You are advised to appear on **10.06.2024** at **10.30** a.m. before HON'BLE FAMILY COURT JUDGE, RANGAREDDY DISTRICT, AT L.B.NAGAR., either in person or through an Advocate failing which, the case will be decided exparte.
(BY THE ORDER OF THE COURT)

D.RAVI KUMAR REDDY
J.ANUSHA
ADVOCATES
Office at: 12-1-417/NP13, Indraprastha colony, Nagole, Hyderabad-500068.

వేలం ప్రకటన
మహారాజశ్రీ కృష్ణాజిల్లా, మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
E.P.No. 12/18 in O.S. 540/14

Between :
Ganugapati China Rami Reddy .... DHR
And
1. Jujjavarapu Tarabayamma (died)
2. Jujjavarapu Lakshmana Rao
3. Jujjavarapu Prabhakar Rao
4. Manda Kumari ..... JDR s

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా జెడిఆర్స్ తాలూకా స్థిరాస్తిని పై కోర్టువారి యెదుట ది. 20-6-2024 ఉదయం 10-30 గం.ల నుండి వేలం వేయబడును. కావున కావలసిన వారు వచ్చి పాడుకొనవలెను. వేలం తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై సదరు ఆస్తి పాడుకొనవచ్చును.

షెడ్యూల్

కృష్ణాజిల్లా, బందరు మునిసిపాలిటీ పరిధిలోని రాజుపేట, డోర్ నెం. 4/940నకు చెందినటువంటి ఆర్‌సిసి బిల్డింగ్ మరియు విస్తీర్ణ 233.8 చదరపు గజాలు గల స్థలం. మొదట జెడిఆర్ అయిన జుఝువరపు తారాబాయమ్మ మరణించిన పిదప వారసులైనే వారి వారసులు 2 to 4 లకు సంబంధించిన వారి స్వాధీనంలో వున్నటువంటి సదరు ఆస్తిని ది. 20-6-2024న కోర్టువారు వేలం జరిపించబడును. సదరు ఆస్తి పూర్వం తనఖా పెట్టబడివున్నది. సదరు తనఖాకు లోబడి వేలం జరుపబడును.

**ఆస్తి యొక్క హద్దులు :-**
తూర్పు :ఉల్లిపాయల అచ్చియ్యకు సంబంధించిన స్థలం
దక్షిణం : కాపూరి రామయ్యకు సంబంధించిన స్థలం
పడమర :జుఝువరపు మస్తాన్‌కు సంబంధించిన స్థలం
ఉత్తరం:జుఝువరపు తాల్లమ్మకు సంబంధించిన స్థలం
ఈ హద్దుల మధ్య 233.8 చ.గజాలు గల స్థలం మరియు ఆర్‌సిసి బిల్డింగ్ కలదు.
డిహెచ్ఆర్ కిమ్మత్తు : రూ.5,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.10,00,000/-
మార్కెట్ వాల్యూ : (స్థలం మరియు ఆర్‌సిసి బిల్డింగ్) రూ. 19,16,600/-
వేలంతేది : 20-6-2024
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
మచిలీపట్నం.
తేది:

కుంపటి ప్రసాద్
కె.మురళి
డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్స్
సెల్ : 9290486417.

# ఓట్ల లెక్కింపుపై అవగాహన ఉండాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** ఓట్ల లెక్కింపు ప్రక్రియలోని ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎన్నికల సిబ్బందికి సూచించారు. సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి జూన్ 4న కష్ణా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సోమవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఎన్నికల సిబ్బందికి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రతి టేబుల్ కు కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్లను లాటరీ పద్ధతిలో కేటాయించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజున ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 17సీ ఫారం ముఖ్యమైన పత్రమని, అందులో కంట్రోల్ యూనిట్ నంబర్, పోలింగ్ స్టేషన్ వివరాలు, పోలైన ఓట్లు తదితర వివరాలు ఉంటాయని, ఆ అంశాలను నిర్ధారించుకున్న తర్వాతే కంట్రోల్ యూనిట్ ను తెరవాల్సి ఉంటుందన్నారు. 17సీ ఫారం లోని వివరాలను కంట్రోల్ యూనిట్ మీద ఉన్న వివరాలతో సరిపోల్చుకున్నానంతరం పవర్ బటన్ను ఆన్ చేయగానే బీప్ సౌండ్ చేస్తూ స్క్రీన్ ఆన్ అవుతుందని, అలా జరగని పక్షంలో ఆందోళనకు గురికాకుండా బ్యాటరీ డౌన్ అయినట్లు గ్రహించి దాని స్థానంలో మరొకటి మార్చుకోవాలని సూచించారు. కంట్రోల్ యూనిట్ లోని అభ్యర్థులకు పోలైన ఓట్ల మొత్తానికి, వీవీప్యాట్లలోని స్లిప్ ల లెక్కింపు మొత్తానికి వ్యత్యాసం ఉన్నప్పుడు వీవీప్యాట్లలోని స్లిప్ ల మొత్తాన్నే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, శిక్షణ నోడల్ అధికారి మురళీ కిషోర్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఓట్ల లెక్కింపు సజావుగా సాగేలా ఏర్పాట్లు**

జూన్ నాల్గో తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం సజావుగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా ఖజానా స్ట్రాంగ్ రూమ్ నుండి మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం సంబంధించి పోలైన 21,139 పోస్టల్ బ్యాలెట్‌లను భద్రపరిచిన 33 ట్రంకు పెట్టెలను ప్రత్యేక వాహనంలో కృష్ణా విశ్వవిద్యాలయానికి గట్టి పోలీసు బందోబస్తు నడుమ తరలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి తన కౌంటింగ్ హాల్ వద్ద పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు కోసం 14 టేబుళ్ళు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఒక్కో శాసనసభ నియోజకవర్గంలో వారికి నమోదైన పోస్టల్ బ్యాలెట్ ల సంఖ్యను బట్టి రెండు నుంచి 8 టేబుళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో మొదలవుతుందన్నారు. అనంతరం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన కృష్ణా విశ్వవిద్యాలయంలో మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ చంద్రశేఖర రావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, జనసేన, వైసిపి, ఐఎన్సి, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల ప్రతినిధులు గరికపాటి సాంబశివరావు, సింహాద్రి వెంకటేశ్వరరావు, కోక ఫణిభూషణ్, కే జగదీష్ ఇండిపెండెంట్ అభ్యర్థులు గూడవల్లి వెంకట కేదారేశ్వరరావు, దామోదర్, ధణేకుల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో వరి విత్తనాలు : శ్రీలత

**ప్రజాశక్తి-ఘంటసాల**

ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని కేవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ఘంటసాల కేవికెలో సోమవారం డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ కషి విజ్ఞాన కేంద్రంలో జూన్ మొదటి వారం నుంచి ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి పంటకు గానూ ఎం టీ యు 1061 (ఇంద్ర) మరియు ఎం టి యు 1318 పునాది విత్తనం అమ్మకానికి సిద్ధంగా ఉంటాయన్నారు. ఎంటీయూ 1061 (ఇంద్ర), ఎంటీయూ 1318 విత్తనాలు 30 కేజీల బస్తా ఒక్కోటి రూ.1200లకు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావలసిన రైతులు 8008201253, 6303705993 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీలత రైతులకు తెలిపారు.

## వృద్ధులకు అన్నదానం

**ప్రజాశక్తి-గుడివాడ:** శ్రీకష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కలవలపల్లి గ్రామానికి చెందిన తాతా సాయి మురళీ కష్ణ యాదవ్, మోహన నాగలక్ష్మి దంపతుల కుమారుడు రేవంత్ సత్య శివరామ్ ఏడో పుట్టినరోజు సందర్భంగా స్థానిక మమతా వృద్ధాశ్రమం, శాంతి వృద్ధాశ్రమం, కరుణాపీఠం వృద్ధాశ్రమాల్లోని వద్ధులకు చీరలు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడుసుమిల్లి వెంకటరత్నం (దొండపాడు బాబాయ్), నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, యాదవ సంఘం మహిళా కార్యదర్శి కుంభం నాగమణి, దేవస్థానం మాజీ సభ్యులు కంతేటి హరిబాబు, నాయకులు జాజుల తాతారావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ, వీరేశలింగం వర్ధంతి

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం వర్ధంతి కార్యక్రమాన్ని గాంధీ క్షేత్రంలో సోమవారం నిర్వహించారు. నెహ్రూ, విరేశలింగం చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత ప్రధానిగా నెహ్రూ చేసిన సేవలను, సంఘసంస్కర్తగా విరేశలింగం సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కోనపరెడ్డి చంద్రశేఖర్, ఎంపీటీసీ బొప్పన భాను, టిడిపి నాయకులు బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహన్రావు, ఘంటసాల రాజమోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

## సీతాదేవి మృతి టిడిపికి తీరని లోటు : వెనిగండ్ల

**ప్రజాశక్తి-గుడివాడ :** మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి మృతి పార్టీకి తీరని లోటని, పెద్ద దిక్కుగా ఉన్న ఆమె మృతిచెందడం బాధాకరమని తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ వసంత్ సిటీలోని యెర్నేని కుమార్తె స్వగృహంలో మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం సీతాదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గెలుపునకు సీతాదేవి చేసిన కషిని ఎన్నటికీ మరువలేమని, ముఖ్యంగా రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా మన ప్రాంత అభివద్ధికి సీతాదేవి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సీతాదేవి స్ఫూర్తితో, మహనీయుల ఆశయాలకు అనుగుణంగా గుడివాడ అభివద్ధికి పాటు పడదామని వెనిగండ్ల, రావిలు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి మృతి పట్ల మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ)లు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. టిడిపి అభివృద్ధికి, బలోపేతానికి ఆమె చేసిన కృషి మరువలేనిదని అన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. **అవనిగడ్డ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి మృతి పట్ల టిడిపి నాయకులు సంతాపం తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సీతాదేవి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు ఉమ్మడి కృష్ణాజిల్లా ముదినేపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు శాసన సభ్యురాలుగా ఎన్నికై ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యా శాఖలో అనేక విప్లవార్థమైన మార్పులు తీసుకురావడంతో పాటు విజయ పాల ఉత్పత్తి కేంద్రంలో డైరెక్టర్‌గా పనిచేసి విజయ డైరీని ముందుకు నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బచ్చు రఘునాథ్, కునపరెడ్డి చంద్రశేఖర్, మండలి రామ్మోహన్రావు, షేక్ బాబావాలి పాల్గొన్నారు.

సీతాదేవికి నివాళులర్పిస్తున్న వెనిగండ్ల, రావి

## జటావత్ జేజమ్మ వర్ధంతి

**ప్రజాశక్తి-ఘంటసాల:** సిపిఎం సీనియర్ నాయకులు జటావత్ రెడ్డి సతీమణి జటావత్ జేజమ్మ 3వ వర్ధంతి మండల పరిధిలోని తెలుగురావు పాలెంలో సోమవారం నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేజమ్మ కుమారుడు జటావత్ బాలాజీ, సిపిఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, ఘంటసాల మండల స్థాయి నాయకులు గొర్రు ముచ్చు వెంకటేశ్వరరావు, కొడాలి డేవిడ్ పాల్గొని జేజమ్మకు నివాళులర్పించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

**ప్రజాశక్తి-మోపిదేవి:** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన యస్.టి అగ్ని బాధిత కుటుంబాలకు పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు సాయం చేసి మరో మారు తన దాతత్వాన్ని చాటుకున్నారు. మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో రాచూరి లంకేశ్వరరావు, రాచూరి శ్రీనివాసరావు, అద్దూరి వీర లంకమ్మల నివాసం ఆదివారం అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయింది. విషయం తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ సోమవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు పర్యవేక్షణలో రూ.15 వేల నగదు, బియ్యం అందజేశారు. రాచూరి లంకేశ్వరరావు కుమార్తెకు చదువు పట్ల ఉన్న ఆసక్తిని తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ పుస్తకాల కొనుగోలు నిమిత్తం కొంత నగదును చిన్నారికి అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, పంచాయతీ ఉప సర్పంచ్ ముమ్మనేని బాబురావు, విక్కుర్తి రాంబాబు, మాజీ సర్పంచ్ కేశాని శివుడు, నీటి సంఘాల మాజీ అధ్యక్షులు వర్రే బసవరావు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, బర్మా బుజ్జి, బొప్పన వెంకటరమణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీలు

**ప్రజాశక్తి-పెదపారుపూడి:** విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథలు పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారిని ఎన్‌వివిఎస్ లక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రేడ్-3 శాఖ గ్రంథాలయం అధికారి లక్ష్మీ వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో భాగంగా ఉదయం మొదటిగా విద్యార్థులచే పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, నీతి కథలు చదివించటం ఆ కథలోని నీతిని వివరించారు. అనంతరం చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ ఆటల్లో చిన్నారులు పాల్గొన్నారు.

# వామ్మో గోతులు...

**ప్రమాదకరంగా కబేళా రోడ్డు**

**ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

**పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు**

**ప్రజాశక్తి - భవానీపురం :** ఊర్మిళానగర్ నుంచి కబేళాకు వెళ్లు రోడ్డు భారీ గోతులతో ప్రమాదకరంగా తయారైంది. దీంతో ఆ రోడ్డులో నిత్యం ప్రయాణించే భారీ వాహనాలు, లారీలు ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్, ముంబై తదితర ప్రాంతాల నుండి వచ్చే భారీ లోడ్ వాహనాలు, టిప్పర్లు ప్రతి నిత్యం నగరంలోకి రాకుండా గొల్లపూడి బైపాస్ రోడ్డు మీదుగా ఎట్కిన్‌సన్ స్కూల్ మీదుగా ఊర్మిళానగర్‌లోకి ప్రవేశించి అటుగా కబేళా రోడ్డు నుండి చనుమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్‌కు చేరుకుంటాయి. ఈ నేపథ్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని నగరపాలక సంస్థకు చెందిన 43, 45 డివిజన్ల ప్రాంతంలోని ఊర్మిళానగర్ రోడ్డులోని ఏజిఎం, ఎం.కే ఫంక్షన్ హాల్స్ సమీపంలోని రోడ్డు కొద్ది రోజులుగా పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది. నాలుగు రోజులుగా అప్పుడప్పుడు కురుస్తున్న వర్షానికి ఆ రోడ్డు మరింత నీటితో నిండి భారీ వాహనాలు ప్రయాణించే పరిస్థితి లేకుండా పోయింది. నిత్యం వేలాది భారీ వాహనాలు ప్రయాణించే ఊర్మిళానగర్ –కబేళా రోడ్డు రాత్రి సమయంలో భారీ వాహనదారులకు ఆ గోతులు కనబడక యాక్సిడెంట్లు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇక ఆటోవాలలు, ద్విచక్ర వాహనదారుల విషయం మరింత దారుణంగా ఉందని అంటున్నారు. పాదచారుల విషయం చెప్పనక్కర లేదు. పేరుకు నగరపాలక సంస్థ అయినా, మున్సిపాల్టీ కంటే కనాకష్టంగా గుంతలు పడి ప్రమాదకరంగా రోడ్డు ఉండటంపై స్థానిక ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు. స్థానిక కార్పొరేటర్లు కూడా పట్టించుకోలేదని విమర్శలు మిన్నంటుతున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు దీనిపై దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యురాలు

## సీతాదేవి మృతి తీరని లోటు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యురాలు యెర్నేని సీతాదేవి మృతి తీరని లోటని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. యూనియన్ పాలకవర్గం తరపున వారి కుటుంబానికి సోమవారం ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కి విద్యాశాఖ మంత్రిగా, రెండు పర్యాయాలు శాసన సభ్యురాలుగా విశిష్ట సేవలు అందించారని చలసాని గుర్తు చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యురాలుగా సీతా దేవి గత 15 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తూ యూనియన్ ప్రగతిలో చెరగని ముద్ర వేశారని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న సిఐ చంద్రశేఖర్‌రావు

## కంచికచర్లలో కార్డెన్ సెర్చ్

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల ఇందిరా కాలనీలో ఎసిపి రవికిరణ్ ఆదేశాల మేరకు సిఐ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో 80 మంది సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం సోమవారం తెల్లవారుజామున నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ రూరల్ సిఐ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇందిరా కాలనీలో 320 గృహాలను తనిఖీ చేయటం జరిగిందని, ఎటువంటి పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులను ఐరిస్ ద్వారా పరీక్షించి పాత నేరస్తుడిని ఒకరిని గుర్తించామన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న వేళ అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందువల్ల, నలుగురు కంటే ఎక్కువమంది గుమికూడొద్దని సూచించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు ఎవరైనా తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ తెలిపారు. కంచికచర్ల ఎస్సైలు సుబ్రహ్మణ్యం, హైమావతితో పాటు పలు పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, వివిధ ప్రాంతాలు చెందిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిటైల్, వినోద రంగంలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ అభివృద్ధి సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ రిటైల్, వినోద రంగాల్లో కూడా ప్రవేశించినట్లు సంస్థ ప్రతినిధి కె.రాజేష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. అపర్ణ నియో మాల్, అపర్ణ సినిమాస్‌ను ప్రారంభించడం ద్వారా రిటైల్, వాణిజ్య, వినోద విభాగాల్లో కూడా ప్రవేశిస్తున్నామని తెలిపారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పలు ప్రాంతాలలో అపర్ణ నియో 3.67 ఎకరాలలో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించినట్లు తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ శిక్షణ కార్యక్రమం ముగింపు సభను ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ మహిళా వికాసం కోసం కళాశాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా సాధారణ మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా రెండు దశాబ్దాలుగా ప్రతి ఏటా వేసవిలో అనేక అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. స్కూటీలో శిక్షణ ఇవ్వటం ద్వారా వారిని మరింత ధైర్యవంతులుగా, అనేక అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు. మహిళా సాధికారత కోసం ఏడాది పొడవునా పలు కార్యక్రమాలను తమ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ నిర్వహిస్తుందని వివరించారు. స్కూటీ, కరాటే వంటి శిక్షణా కార్యక్రమాలు ఏడాది పొడవునా కొనసాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వాసవి విజయవాడ సంస్థ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్‌కు స్కూటీని బహూకరించింది. ఈ కార్యక్రమంలో వాసవి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా అమర్‌సుధీర్, మాజేటి రామచంద్రరావు, కన్వీనర్ జల్లూరి శ్రీనివాసరావు కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కష్ణవేణి, స్టడీ సెంటర్ కన్వీనర్ వీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బేలర్‌తో వరి గడ్డి వృథా కాదు

**ప్రజాశక్తి - వత్సవాయి :** మండలంలో పోలంపల్లి పోచవరం, గంగవల్లి, లింగాల, ఆలూరుపాడు, పాత వేమవరం, వత్సవాయి, ఖమ్మంపాడు, మంగోల్లు తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తుంటారు. దీంతో కోసిన వరిగడ్డి కట్టలు కట్టి ఇళ్లకు తేవాలంటే అదొక పనిగా రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో కోసిన వరితో గడ్డి పొలమంతా ఉండటంతో దాన్ని పోగు చేయడమే ఒక పనిలా ఉంటోంది. దీనికి నానా అవస్థలు పడుతున్నారు. దిండులు కట్టలేక కొంతమంది రైతులు పొలాల్లోనే కాల్చేస్తున్నారు. గడ్డిని కాల్చేయడం వల్ల డైరీ ఫార్మ్ నిర్వహించే రైతులకు పశుగ్రాసం కరువైపోతుంది. ఈ గ్రాసానికి డిమాండ్ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో రైతులు, పాడి రైతులు బేలర్ యంత్రాలతో కట్టలు కట్టిన గడ్డిని తెచ్చుకుంటూ పశుగ్రాసం కొరత తీర్చుకుంటున్నారు.

**ఒక్కొక్క కట్టకు రూ.30 నుండి 35 ల వరకు ఖర్చు**

వరిగడ్డి కట్టే బేలర్ కట్టలు కట్టటానికి బేలర్ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేస్తున్నారు. ట్రాక్టర్ నడుస్తుంటే వెనకున్న యంత్రం పొలంలో ఉన్న గడ్డిని కట్టలుగా కట్టేస్తుంది. ఎకరం గడ్డిని ఒక గంటలోనే 40 నుంచి 50 కట్టల వరకు కడుతుంది. ఒక్కొక్క కట్టకు రూ.30 ల నుంచి 35 ల వరకు ఖర్చవుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో గేదెలు పెంచుకునేవారు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ముందుగా రైతులకు ఎంతో కొంత చెల్లించి యంత్రాలు ద్వారా కట్టలు కట్టించుకుంటున్నారు. యంత్రాల వల్ల పనులు సులభతరంగా మారిందని రైతులు సంతోషం చేస్తున్నారు. రైతులు గడ్డిని ఎకరానికి 5000 చొప్పున వేరే పశు గ్రాసం రైతులకు అమ్ముకుంటున్నారు. గతంలో వరిగడ్డిని పొలాల్లోనే నిప్పు పెట్టి కాల్చివేసేవారు. నేడు అలా కనిపించడం లేదు. యంత్రాంల ద్వారా కట్టలు కట్టడంతో వరిగడ్డి నిల్వ కూడా సులభతరమైందని పలువురు రైతులు చెబుతున్నారు.

**నిల్వ చేసుకోవటం సులభం : పొన్నపూల సురేష్**

కట్టలు కట్టిన గడ్డిని రైతులు నిల్వచేసుకోవడం సులభతరంగా ఉందని సింగవరం గ్రామానికి చెందిన రైతు పొన్నపోల సురేష్ అన్నారు. గడ్డి కూడా వృథా కాకుండా ఉంటుందన్నారు. వరిగడ్డి కట్టడం వల్ల రైతులకు కూడా ప్రయోజనకరంగా ఉందన్నారు. వచ్చే వర్షాకాలంలో గడ్డి కొరత ఉండకుండా నిల్వ ఉంచేందుకు సులభంగా ఉంటుందని చెబుతున్నారు.

## క్షేమ సుకృతి పంట బీమా ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో క్షేమ సుకృతి పంట భీమా పథకాన్ని ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి కె.ఎస్.ఆర్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రుతుపవనాల రాకతో ముఖ్యమైన ఖరీఫ్ పంటలు విత్తే కాలం ప్రారంభమవుతున్న సందర్భండా పంట భీమా కోసం కొత్త పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. క్షేమ సుకృతి విస్తృత పరిధి రైతులకు, వారి కుటుంబ సభ్యులకు బీమా చేయడంతో పాటు ఆదాయాలు ఉన్న వారు ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. వీటి వివరాలకు క్షేమ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

## రఘునందన్‌కు ఎన్టీఆర్ జాతీయ సాహితీ పురస్కారం

**ప్రజాశక్తి - తిరువూరు :** అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్య దర్శి రేపాక రఘునందన్‌కు 2024 జాతీయ పురస్కారం లభించింది. పలు పత్రికల్లో అనేక కవితలు, కథలు, వ్యాసాలు రచించడమే కాకుండా ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి అనేక ఉపన్యాసాలు, కవితా పఠనం ద్వారా సుపరిచితుడైన రఘునందన్ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను తెలుగు, హిందీ భాషలలో రచించడమేకాక భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా పైడిమర్రి ముఖచిత్రంతో పోస్టల్ కవరు విడుదల చేయడానికి విశేషంగా కృషి చేశారు. వీటి పలితంగా రఘునందన్ కు మరో జాతీయ పుర స్కారం లభించింది. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ హైదరాబాద్ వారు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఈ జాతీయ పుర స్కారాన్ని మే 28 న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదానం చేస్తున్నట్లు సంస్థ చైర్మన్, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ సమాచారం ఇచ్చారని రఘునందన్ తెలిపారు. తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్న ఆయనకు జాతీయ స్థాయి పురస్కారం లభించడం పట్ల తిరువూరు ప్రాంత రచయితలు, కవులు సాహిత్యాభిమానులు రఘునందన్ కు అభినందనలు తెలియజేశారు.

# ఎక్కడి సమస్యలు అక్కడే...

రోడ్డు పక్కనే నిలిచిన మురుగు

- గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- పని చేయని చేతిపంపులు
- పంచాయతీలను వెంటాడుతున్న నిధుల కొరత

**ప్రజాశక్తి-గన్నవరం:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ప్రజా సమస్యలు ఎక్కడివి అక్కడే వున్నాయి. మేజర్ పంచాయతీల్లో ఈ సమస్యలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా బుద్ధవరం, ముస్తాబాద, గన్నవరం, కేసరపల్లి పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో సర్పంచులు చేతులెత్తేశారు. దీనికి ప్రభుత్వమే కారణమని చెబుతున్నారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి మురుగు వాసన వస్తుండటంతో పరిసర ప్రజలు నానా అగచాట్లకు గురవుతున్నారు. గన్నవరంలో ముస్లింపేట, దళితవాడ, శ్రీనగర్ కాలనీ, గౌడపేట, చెంచుల కాలనీ ఏరియాల్లో చెత్త ఎక్కడిదక్కడే అన్నట్లుగా ఉంటుందని జనాలు చెబుతున్నారు. పంచాయతీలో సిబ్బంది ఉన్నాచెత్తను శుభ్రం చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శిస్తున్నారు. బుద్ధవరం పంచాయతీ పరిధిలోని దావాజిగూడెం, పామర్తినగర్, రాజీవ్‌నగర్, సుబ్బారావుకాలనీలో చెత్త, మురుగు సమస్య తీవ్రంగా ఉంది. చెత్త పేరుకుపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వల్లో పూడికలు తీసి చాలా కాలం అయ్యిందని ప్రజలు చెప్పారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో పని చేయడానికి అధికారులు చర్యలు తీసు కోవడం లేదనే వాదనుంది. డ్రైనేజీల్లో పూడికలు తీయడం లేదు. దీంతో ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచిపోతుంది. సుబ్బారావు నగర్లో అపార్టుమెంట్లో వాడిన నీరంతా రోడ్డుపైకి వస్తుంది. ముగురు వాసన వెదజల్లడంతో నివాశితులు నానా అగచాట్లు పడుతున్నారు. కేసరపల్లి పరిధి లోని చెంచులకాలనీ, దుర్గాపురం, సుందరయ్యనగర్, దళితవాడ, వెంకటనరసింహపురంలో చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. రోడ్లపైనే చెత్త కుప్పలు పారేయడంతో దుర్వాసన వ స్తుంది. మురుగు డ్రైనేజీలు పారకుండా నీరు నిలిచిపోతుంది. దోమలు ఉత్పత్తి చెంది జనా లపై దాడులు చేస్తున్నాయి. అధికారుల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని అంటున్నారు. పంచాయతీల్లో నిధులున్నా వాటిని డ్రా చేయడానికి వీల్లేకుండా ప్రభుత్వం ఆం క్షలు పెట్టడంతో అధికారులు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. వేసవిలో మంచినీటి సమస్య వస్తున్నా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. కొత్త బోర్లు వేం దామంటే చేతిలో చిల్లిగవ్వ లేదంటున్నారు. డ్రైనేజీ లో పూడికలు తీయడానికి నిధులు లేక పోవడంతో ఏమీ చేయలేకపోతున్నామని చెబుతున్నారు. మండలంలోని 17 మైనర్ పంచా యతీల్లో చెత్త సమస్యతో పాటు పారిశుద్ధ సమస్య అధికంగా ఉంటుంది. అధికారులు ఏమీ చేయలేక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి మార్గం చూపించాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

పని చేయని చేతిపంపు

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న హర్షవర్ధన్

## హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులు

**ప్రజాశక్తి-గన్నవరం:** 2024 పవిత్ర హజ్ యాత్రను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి, చైర్మన్ హజ్ ఆపరేషన్స్ హర్షవర్ధన్ సోమవారం తెల్లవారుజామున గన్నవరం ఈద్గా జామా మసీదు హజ్ క్యాంపు నుండి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. వక్ఫ్ బోర్డు సీఈవో మరియు హజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్ మరియు హజ్ కమిటీ సభ్యులు సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ అలీం బాష, దూదేకుల కార్పొరేషన్ ఎండి గౌస్ పీర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్‌వలి తదితరులు హజ్ యాత్రికులకు అభినందనలు తెలిపారు.

### నేడు రెండో బృందం

హజ్ యాత్రకు 322 మందితో రెండో బృందం ఈ నెల 28వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు గన్నవరం ఈద్గా జామా మసీదు హాజ్ క్యాంపు నుండి బయలుదేరి గన్నవరం విమానాశ్రయం నుండి సాయంత్రం 4:55 గంటలకు రెండో విమానంలో బయలుదేరతారని హాజ్ కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. అదే విధంగా 48 మందితో మూడో బృందం 29వ తేదీ బుధవారం ఉదయం 7.10 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి మూడో విమానంలో బయలుదేరి హజ్ యాత్రకు వెళ్తారని కమిటీ తెలిపింది.

## పన్ను బకాయి వసూలు

**ప్రజాశక్తి-చల్లపల్లి:** గ్రామ పంచాయతీకి బాకీ పడిన 16 సంవత్సరాల పన్ను బకాయిలు అధికారుల చొరవతో ఎట్టకేలకు వసూలయ్యాయి. స్థానిక అగ్రహారంలోని ఇరిగేషన్ కార్యాలయం భవనానికి చెల్లించాల్సిన ఇంటిపన్ను, నీటికుళాయి పన్నులు పెండింగ్ లో పడ్డాయి. పెండింగ్ బకాయిలు చెల్లింపులపై కార్యదర్శి పీవీ మాదవేంద్రరావు ఇరిగేషన్ ఉన్నతాధికారులకు లేఖ పంపటంతో అధికారులు ట్రెజరీ ద్వారా పంచాయతీ నిధులకు జమచేశారు. 2008-09 సంవత్సరం నుంచీ 2023-24 సంవత్సరం వరకు మొత్తం ఇంటిపన్ను రూ.43,985, కుళాయి ఫీజు రూ.19,200 మొత్తం రూ.63,185 చెల్లించినట్లు కార్యదర్శి తెలిపారు. బకాయిలు చెల్లింపుకు కషిచేసిన ఇరిగేషన్ ఈఈ పీవీ. కష్ణారావు, డీఈ రావెళ్ల రవికిరణ్, ఏఈ కె.శ్రీరామ జనార్ధన్లకు సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, కార్యదర్శి మాధవేంద్రరావు, పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పంట కాలువను ప్రభుత్వమే తవ్వించాలి : గౌరిశెట్టి

**ప్రజాశక్తి-బంటుమిల్లి:** కృత్తివెన్ను మండలం చిన్నపాండ్రాక గ్రామంలో బంటుమిల్లి మెయిన్ కాలువ నుండి చిన్నపాండ్రాక గ్రామం మీదుగా పర్లోకి వెళ్లే కొత్త బోధి మూడు కిలోమీటర్లకు పైనే ఉంటుంది. దీని కింద దాదాపు 700 ఎకరాల ఆయకట్టు భూములు సాగవుతున్నాయి. కొత్త బోధి పంట బోధిగాను, మురుగు బోధిగాను పని చేస్తుంది. ఈ బోధిని దాదాపు 15 సంవత్సరాల క్రితం తవ్వారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వపరంగా తవ్వలేదు. గత సంవత్సరం రైతులే సొంత డబ్బులతో

తవ్వుకున్నారు. ఇక నుంచైనా ప్రభుత్వమే తవ్వించాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు సోమవారం పంట బోధిని పరిశీలించి మాట్లాడుతూ ప్రజలకు కొన్ని వందల ఎకరాలకు ఉపయోగపడే ఈ బోధిని ప్రభుత్వమే తవ్వించాలన్నారు. ఈ సీజన్లో తవ్వించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో లంకదాసుల అజయ్‌ఘోష్, రైతులు నల్లగంచు సత్యనారాయణ, కొణతం గిరిరాజులు, మేక శ్రీనివాసరావు, కూనపురెడ్డి మధు, సుధా బత్తుల ప్రభాకర్‌రావు, రాయపు రెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## హుండీల ఆదాయం రూ.34 లక్షలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. యాత్రికులు సమర్పించిన కానుకుల హుడీలను తెరచి లెక్కించగా 61 రోజులకు రూ 34,80,780 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. తనిఖీ అధికారి టివివి మోహనరావు సమక్షంలో ఈ లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు.

## పాడి రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు : చలసాని

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు**

మండల పరిధిలోని వేమవరం మరియు కవుతరం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘంలో సోమవారం పాడి రైతు సంక్షేమం మన మతం అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతుల సమస్యలను కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు అందించే ధర వ్యత్యాసం, కళ్యాణమస్తు, క్షీరభంధు, ప్రతిభా, ఆక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాల గురించి మరియు పాడి పశువులకు అందించే పశు భీమా, డీ వార్మింగ్ ,పశు దాణా, కాల్షియం, మినరల్ మిక్సర్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను పాడి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు

మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

విబికెవి సుబ్బారావు, గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, వేమవరం సంఘ అధ్యక్షులు మన్నెం వెంకటేశ్వరరావు సూపర్ వైజర్ పెయ్యేటి బసవ రాజ కుమార్, వేతన కార్యదర్శి జాస్తి రామకృష్ణ, కృష్ణారావు సంఘ పాలక వర్గ సభ్యులు మరియు పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు

# పోస్టల్ బ్యాలెట్లు మచిలీపట్నం తరలింపు

**ప్రజాశక్తి-గన్నవరం**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గంలో పోలింగ్ దశలో పోలైన పోస్టల్, హెూమ్ ఓటింగ్ బ్యాలెట్ పేపర్లను గన్నవరం నియోజకవర్గంలోని సబ్ ట్రెజరీలో భద్రపరచడం జరిగింది. సోమవారం ఉదయం అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో సబ్ ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన సీల్‌ను తొలగించి పోస్టల్ బ్యాలెట్‌లు ఉంచిన బాక్సులను పూర్తి సెక్యూరిటీతో మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా ట్రెజరీకి తరలించారు. గన్నవరం నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, పోస్టల్ బ్యాలెట్ బాధ్యులు ఉంగుటూరు మండలం తహశీల్దారు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ఎన్నికల ఏజెంట్లు గూడవల్లి నరసింహారావు (టిడిపి), ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు (ఆర్‌పిఐ), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), గన్నవరం సబ్ ట్రెజరీ అధికారి టి.నాగరాజు సమక్షంలో పూర్తి




పారదర్శకతతో సబ్ ట్రెజరీను తెరచి మొత్తం మూడు బాక్సుల్లో ఉన్న పోస్టల్, హోమ్ ఓటింగ్ బ్యాలెట్‌లను మచిలీపట్నం తరలించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు తహశీల్దారు జె.వి.సుబ్బారావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో 1580 పోస్టల్ బ్యాలెట్లు పోలైనవని బయట నియోజకవర్గం నుండి 852 పోస్టల్ బ్యాలెట్లు పోలవగా మొత్తం పోస్టల్‌కు సంబందించి 2432 ఓట్లు పోలైనవని హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 272 ఓట్లు పోలైనవని మొత్తం 2704 ఓట్లు ఉన్న బాక్సులను ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో మచిలీపట్నం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీకి తరలిస్తున్నామని తెలిపారు. ఆర్వో గారి ఆదేశాల మేరకు కౌంటింగ్ రోజున ఉదయం జిల్లా ట్రెజరీ నుండి కృష్ణా యూనివర్సిటీలోని గన్నవరం అసెంబ్లీ కౌంటింగ్ హాలుకు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. అలాగే సర్వీసు ఓటర్లకు సంబందించి 73 మంది దరఖాస్తును సమర్పించారని ఇప్పటి వరకు 21 సర్వీసు ఓటర్లకు సంబందించి పోస్టు ద్వారా బ్యాలెట్ కవర్లు ఆర్వో కార్యాలయానికి అందాయని, కౌంటింగ్ ముందు రోజు వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటి తహశీల్దారు ఎ.ఎస్.ఆర్ గోపాల్‌రెడ్డి, గన్నవరం తహశీల్దారు ఎన్.ఎస్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లల్లో పరిశీలనలు చేస్తున్న పోలీసులు

## ప్రతి ఇల్లూ పరిశీలన

**ప్రజాశక్తి - గంపలగూడెం:** ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు పోలీసులు చేపడుతున్నారు. అందులో భాగంగా తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో తిరువూరు, ఏ కొండూరు, గంపలగూడెం, ఎస్ఐలతో పాటు 60 మంది కానిస్టేబుల్ ఒక్కసారిగా, సొబ్బాల గ్రామాన్ని సందర్శించి, గార్డెన్ (వలయాకారంలోచుట్టుముట్టి) చర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇల్లు పరిశీలించి సరైన పత్రాలు లేని వివిధ రకాల వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. గ్రామాల్లో సమస్యలు వస్తే తమకు తెలపాలని ప్రజలకు వివరించారు. ఏ సమస్య వచ్చినా తామన్నామని భరోసా కల్పించారు. ఊరంతా జల్లెడ పట్టి ప్రజలందరికీ సదరు విషయాన్ని తెలిపారు. ఎస్సైలు సత్యనారాయణ, చల్లా కృష్ణ, ఎస్.శ్రీనివాస్‌లున్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

## మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి - మైలవరం :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక లకిరెడ్డి హనీమిరెడ్డి కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత చలివేంద్ర శిబిరంలో 22వ రోజు సోమవారం కూడా కొనసాగింది. శ్రీ స్వాతి స్టోన్ క్రషర్, శ్రీ స్వాతి సిల్వర్ ప్యాలస్ మైలవరం, శ్రీ విజయ ఫ్లయాష్ బ్రిక్స్ ఏ కొండూరు, తమ్మిశెట్టి రాజేంద్రప్రసాద్ అండ్ సన్స్, టీ.మురళి కృష్ణ, టి.విజయ్ కాంతుల సహకారంతో 300 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. కాంప్లెక్స్‌లోని పలువురు దాతల సహకారంతో 22 రోజులుగా బాటసారులకు మజ్జిగ, మంచినీళ్లు అందిస్తూ ఉండటం మంచి కార్యక్రమమని వక్తలు అన్నారు. దాతలను అభినందించారు. నిర్వాహకులు ఐ నీడ్స్ పుల్లారెడ్డి, చంద్రం, శివ, మల్లికార్జున్ రావు, భవ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

**ప్రజాశక్తి - గంపలగూడెం :** మండల వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని గంపలగూడెం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మైకు ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. జరగనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా ముగ్గురు, నలుగురికి మించి ఒకే చోట ఉంటే చర్యలు చేపడతామని చెప్పారు. ఆ విధమైన తప్పిదాలకు ఎవరు అవకాశం ఇవ్వొద్దన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు మండల వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, ప్రజలు, నాయకులు సహకరించాలని ఎస్ఐ కోరారు. ఈ లోపు సభలు, సమావేశాలు నిర్వహించాలంటే పోలీసు అనుమతి తప్పనిసరి అని వివరించారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట గురుకుల కళాశాలలో ఎంఇసి గ్రూపులో 12 ఖాళీలు ఉన్నాయని జగ్గయ్యపేట గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ సుజాత తెలిపారు. ఈ 12 సీట్లలో ఎస్సీ 7, ఎస్.టి 2, బిసి సి3 ఖాళీలున్నాయని ఈ ఖాళీలు నింపేందుకు ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల గురుకుల పాఠశాలలో ఈ నెల 29 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. విద్యార్థులు ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాసి ఫోన్ చేసి పిలిచిన వారు తమ ర్యాంక్ కార్డ్, ఆధార్ కార్డ్, క్యాస్ట్ సర్టిఫికెట్, పదో తరగతి పాస్ మెమో తీసుకుని కుంటముక్కల వెళ్లాలని తెలిపారు.

# పైకి గాంభీర్యం.. లోలోన గుబులు

**ప్రజాశక్తి - వత్సవాయి :** జగ్గయ్యపేట నియోజకవర్గంలో గెలుపు ఎవరి సొంతం అవుతుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. విశ్లేషణలు మాత్రం జోరందుకున్నాయి. ఫలితాలు తేల్చేందుకు ఇంకా వారం రోజులు ఉండగా గెలుపు ఓటములపై అభ్యర్థులతో పాటు ఇటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. మేము గెలుస్తా మేం గెలుస్తాం అంటూ ఎవరికి వారే అంచనాలపై అంచనాలు వేస్తూ ధీమాగా ఉన్నారు.

### ఓటర్ల తీర్పు ఎటో...

జగ్గయ్యపేట టిడిపి సీటు విషయంలో మొదటినుండి నియోజకవర్గం వారే ఆధిపత్యం వహిస్తున్నప్పటికీ సమీకరణాల దృష్ట్యా పర్యాయాలుగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన శ్రీరామ్ తాతయ్యకు ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గం తాతయ్యకు మాత్రం గట్టిగా సపోర్ట్ చేశారని వినిపిస్తున్నాయి. గతంలో 2019 ఎన్నికల్లో అక్కడఅక్కడ అనువాన్య కారణాలవల్ల కొన్ని వర్గాలు చేయలేకపోవడం వల్లే తాతయ్య ఓడిపోయాడని అక్కడక్కడ చర్చగా మారింది. కానీ 2014 ఎన్నికల్లో టిడిపి ఓడిపోతే మనుగడ కోల్పోయినట్లేనని తెలుసుకొని ఆ సామాజిక వర్గం గెలుపు కోసం గట్టిగా కృషి చేసినట్లు తెలుస్తుంది. ఆర్థిక సహాయాలు కూడా చేశారనే మాటలు బహిర్గతంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఆ సామాజిక వర్గానికి చెందిన వత్సవాయి మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన బొల్లా రామకృష్ణ (బిఆర్‌కె) జగ్గయ్యపేట నియోజవర్గం నుండి టిడిపి నుండి టిక్కెట్ కోసం పోటీ పడగా అధిష్టానం మాత్రం తాతయ్యకు వాగ్దానం చేసింది. ఆ సమయంలో సీనియర్ నాయకులు రామకృష్ణకు ఇస్తారేమోనని సందిగ్ధంలో పడ్డారు. ఏదేమైనా గెలుపు ఓటములపై రాజకీయ చర్చలకు జూన్ 4వ తేదీన జగనన్న ఓట్ల లెక్కింపుతోనే తెరపడనుంది. ఓటర్లు నాయకులు మాత్రం రోజులు లెక్కేసుకుంటూ జూన్ 4వ తేదీ కోసం చూస్తున్నారు. దగ్గర పడుతున్న కొద్ది కార్యకర్తల్లో నాయకుల్లో టెన్షన్ పెరుగుతోంది.

### గెలుపు ఓటములపై తర్జనభజన..

ఎన్నికల ప్రక్రియ గెలుపు ఓటములపై ఆ పార్టీ అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు గత ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరవేసింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుస్తారనే చర్చ నియోజకవర్గంలో విస్తతంగా కొనసాగుతుంది. తెలుగుదేశం పార్టీ వారు ఈసారి శ్రీరామ్ రాజగోపాల్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019 గత ఎన్నికల్లో సామినేని ఉదయభాను 4,774 ఓట్లపై గెలుపొందారు. ఈ మూడు పార్టీలు ఏకమయ్యాయని గెలుపు మాత్రం టిడిపిదేనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీపై కార్యకర్తలు విసిగి వేసారి పోయారని పేర్కొన్నారు. ఇద్దరు నాయకులు మాత్రం లోలోపల మదనపడుతున్నట్లు తెలుస్తోంది.

### మహిళా ఓటర్లు ఎవరి వైపు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మహిళా ఓటర్‌లు ఎక్కువగా ఉండటంతో మహిళలు ఎటువైపు వేశారా అని నాయకులు సందిగ్ధంలో పడ్డారు. గెలుపు ఓటములపై మహిళలు కీలక పాత్ర అని ప్రజలు అంటున్నారు. జగ్గయ్యపేట బరిలో ఎవరు గెలుస్తున్నారంటూ పొరుగు నియోజకవర్గాల వారు కూడా ఇక్కడ ఉన్న బంధువులు స్నేహితులు, తోబుట్టువులు ఫోన్లు చేస్తూ ఆరా చేస్తున్నారు. ఈ సంవత్సరం ఎన్నికల పోలింగ్ మాత్రం యువకులు, మహిళలు వారి ఓటు హక్కు వినియోగించుకున్న నేపథ్యంలో మీరంతా ఏ పార్టీ వైపు నిలబడ్డారనే అంశంపై ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఓటుకు నోటు ప్రభావం ఎంతవరకు ఉంటుందనే దానిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది.

## ఉపాధి కార్మికులకు పనిదినాలు పెంచాలి

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ బడ్జెట్ పెంచాలని పని దినాలు 200 రోజులకు కల్పించాలని కనీస వేతనం రూ.600లకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. విస్సన్నపేటలో స్థానిక విస్సన్నపేట ఉపాధి హామీ పథకం భాగంగా పనులకు వెళ్లే కూలీలతో ఉపాధి హామీ పథకం సమస్యలపై మాట్లాడారు. ఉపాధి కూలీలకు పాత పద్ధతి ప్రకారం మస్టర్లు తీసుకోవాలని రెండు ఫొటోలు విధానం రద్దు చేయాలని రెండు పూటల పని విధానం కూడా రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కూలీల పని దినాలు ముగ్గురు లేక నలుగురు ఉన్న కుటుంబంలో ఒక నెలకు పరిమితం అవుతున్నారని ప్రభుత్వం

కూలీలతో మాట్లాడుతున్న నాగరాజు

పునర్ ఆలోచన చేసి కుటుంబంలో ఉన్న సభ్యులందరికీ పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

## జెవివితో సైన్స్ పరిశోధనలు సామాన్యులకు చేరువ

**ప్రజాశక్తి - తిరువూరు :** భారత దేశ రాజ్యాంగం నిర్దేశించిన మేరకు ప్రజలలో శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి కృషి చేయడంతో పాటు, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై జన విజ్ఞానవేదిక గత 36 ఏళ్లుగా విశేష కృషి చేస్తోందని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ తెలిపారు. సోమవారం తిరువూరులోని స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జెవివి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ పరిశోధన ఫలాలు సామాన్యులకు అందాలంటే జెవివి వంటి సైన్స్ ప్రచార సంస్థలు బలోపేతం అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ జెవివిలో సభ్యులుగా చేరాలని ఆయన కోరారు. ఈ

సమావేశంలో జెవివి జిల్లా ఉపాధ్య క్షుడు ఎం.హరికృష్ణ, నాయకులు ఎం.రాం ప్రదీప్, కె.పాపారావు, డి.సుదర్శన్, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొ న్నారు.

## విద్యార్థులకు నీతి కథలు

**ప్రజాశక్తి - గంపలగూడెం :** విద్యార్థులకు నీతి కథలతో పాటు ఆంగ్ల భాషలో చేతిరాత నేర్పినట్లు పెనుగొలను గ్రంథాలయ శాఖ ఇన్‌ఛార్జ్ శ్రీలత తెలిపారు. విశ్రాంత ఎంఇఒ వి.శేషిరెడ్డి విచ్చేసి విద్యార్థులను చైతన్య పరుస్తున్నట్లు వివరించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం ఆయా కార్యక్రమాలు నిర్వహించారు.



గంపలగూడెం గ్రంథాలయంలో...

## జనరల్ నాలెడ్జిపై అవగాహన

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన గ్రంథ పాలకులు టీ.సాంబశివరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఎంతో విలువైన పలు రకాల పుస్తకాలున్నాయని ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం గ్రంథాలయంలో...

## పిడిఎస్ అధికారుల దాడులు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** గోడౌన్‌లలో పిడిఎస్ బియ్యం నిల్వ చేశారని ఫోన్ ద్వారా తహశీల్దార్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన జగ్గయ్యపేట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో నాలుగు దుకాణాల్లో శాంపిల్ సేకరించారు. సేకరించిన బియ్యాన్ని పరీక్షించేందుకు పంపినట్లు అర్ఐ తెలిపారు.

## అన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ ఆలయంలో ప్రతిరోజూ జరిగే నిత్యాన్నదానం పథకానికి అక్బర్ రోడ్, సికింద్రాబాద్‌కు చెందిన పి.సునంద దంపతులు రూ.1,00,001లను విరాళంగా ఆలయ అధికారులను కలిసి దేవస్థానంనకు చెక్కును అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

## 29న హుండీల లెక్కింపు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** తిరుమలగిరి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను ఈ నెల 29న లెక్కించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి.జయ ప్రకాష్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కిస్తామని, యాత్రి కులు, గ్రామస్తులు ఈ హుండీల లెక్కింపులో పాల్గొనాలని జయ ప్రకాష్ బాబు కోరారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు : డిఎంహెచ్ఓ

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** చట్ట వ్యతిరేకమైన లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి గీతాబాయి హెచ్చరించారు. సోమవారం అవనిగడ్డలోని హరిత నర్సింగ్ హోమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలల నిర్వహణ ఆల్ట్రా సౌండ్ పరీక్ష కేంద్రాలను పరిశీలించి తగిన సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా గత వారంలో అవనిగడ్డలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో సిజేరియన్ ఆపరేషన్ జరిగి ప్రస్తుతం ఆంధ్ర హాస్పటల్ విజయవాడ నందు వైద్య చికిత్స పొందుతున్న మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి కి సంబంధించిన వైద్య రికార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జన్యు సంబంధ సలహా కేంద్రాలు, ప్రయోగశాలలు, అల్ట్రాసౌండ్ పరీక్ష కేంద్రాలు, ఇమేజింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి తిరిగి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందికి తగిన అర్హత ఉండాలని తగిన ప్రమాణాలు కలిగిన పరికరాలు, పక్కాగా రికార్డులు ఉండాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లను పరీక్షించి వాటి అనుమతులను పరిశీలించారు. జిల్లాలో ఎక్కడైనా తగిన అనుమతులు లేకుండా వైద్యశాలలు, నర్సింగ్ హోమ్‌లు, లేబరేటరీలు పరీక్షా కేంద్రాలు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నాగాయలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య అధికారులను సిబ్బందిని వారి యొక్క కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి తగిన సూచనలు

సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ విజయకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సిబ్బంది బి.శివసామిరెడ్డి, బి.రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల్లో తనిఖీ

**ప్రజాశక్తి-చల్లపల్లి:** చట్ట వ్యతిరేకమైన లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతాబాయి హెచ్చరించారు. సోమవారం జిల్లాలోని చల్లపల్లిలో గల రాజ్యలక్ష్మి నర్సింగ్ హోమ్, రమేష్ హాస్పటల్ లను ఆకస్మికంగా సందర్శించి వైద్యశాల నిర్వహణ, అల్ట్రా సౌండ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా తగిన అనుమతులు లేకుండా వైద్యశాలలు, నర్సింగ్ హోమ్‌లు, లాబరేటరీలు, పరీక్షా కేంద్రాలు గుర్తించినట్లయితే వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మరియు చట్టరీత్యా లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడిన వారు శిక్షార్హులకుదురని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ విజయకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది బి.శివసాంబిరెడ్డి, బి.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి-మోపిదేవి:** మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకానికి మచిలీపట్నంకు చెందిన పోలిశెట్టి శైలజ కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు ఆలయ సూపర్డెంట్ బొప్పాన సత్యనారాయణకు సోమవారం అందజేశారు. అనంతరం దేవస్థాన అధికారులు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఆటలు... నీతికథలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** నేటితరం విద్యార్థులు గ్రంథాలయాల్లో నీతి కథలు ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంధాల అధికారిని టి.వాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులచే నీతి కథలు చదివించి తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించారు. అనంతరం క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ పోటీలతో పాటు క్రాఫ్ట్ వర్క్‌ను కె.లక్ష్మి విద్యార్థులకు నేర్పించారు.

# ఘర్షణలు సృష్టిస్తే రౌడీషీటు : సిఐ

**ప్రజాశక్తి-ఘంటసాల:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరిగే వేళ ఎవరైనా గొడవలు చేస్తే వారి పై రౌడీ షీట్ తెరుస్తామని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. ఘంటసాల పోలీస్ మండలంలోని వైసిపి, టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో

జరగడానికి సహకరించిన రాజకీయ పార్టీల నేతలు కౌటింగ్ సమయంలో కూడా సహకరించాలని కోరారు. ఎన్నికలు పురస్కరించుకుని ఏగ్రామంలోనైనా అల్లర్లు సష్టించిన, గొడవలు పడిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి పై రౌడీషీట్ తెరవడం జరుగుతుందని హెచ్చరించారు. కావునా ఆయా గ్రామాల్లోని యువత, పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రశాంత వాతావరణం ఉండేలా నేతలు చూడాలని సీఐ నాగ ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ ఇన్చార్జి సీహెచ్.పద్మారావు, ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ వేమూరి ప్రవీణ్, సేవదల్ మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు పాల్గొన్నారు.

# కృష్ణప్రసాద్‌ను కలిసిన ఎస్‌సి నాయకులు

**ప్రజాశక్తి-గూడూరు**

పెడన నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌ను సోమవారం గూడూరు మండలంలోని వివిధ గ్రామాల చెందిన దళిత నాయకులు జిల్లా ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉడుముల నరేష్ ఆధ్వర్యంలో బంటుమిల్లి లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్‌సి కార్పోరేషన్, సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అంగర రంగనాథ్, ఉడుముల పుల్లయ్య, అట్లూరి శ్రీను, కొమ్ముకూరి శ్రీనివాసరావు, కొల్లూరి కోటేశ్వరరావు, కోన చంటి, పెనుమచ్చా అశోక్, ఉడుముల ప్రకాష్, యువరాజు, శాసిగిరి, జమాదగ్ని తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సతీష్

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్:** జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో హద్దు మీరి ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చిలకలపూడి సీఐ సతీష్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక 10వ డివిజన్ లో వివిధ వర్గాల ప్రజలతో సమావేశమైన ఆయన శాంతిభద్రతలపై సమీక్షించారు. 144 సెక్షన్, పోలీస్ 30 అమలులో ఉన్న నేపథ్యంలో ఎటువంటి ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## యువకుల మధ్య గొడవ

**ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు):** ఆర్ఎంఎస్ కాలనీ సమీపంలోని మసీదు వద్ద అతిగా మద్యం సేవించి యువకులు ఘర్షణ పడ్డారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 107 కింద కేసు నమోదు చేసి సోమవారం తాడేపల్లి తహశీల్దార్ ముందు హాజరుపరిచినట్లు పట్టణ సిఐ కల్యాణరాజు తెలిపారు. పోలింగ్ అనంతరం ఫలితాలు మరో వారం రోజుల్లో రానున్న నేపథ్యంలో తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన యువకులు తాగి ఘర్షణ పడ్డారు. ఎస్ఐ ప్రతాప్ యువకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలాంటి జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## ఘర్షణలకు పాల్పడొద్దు : త్రినాథ్

**ప్రజాశక్తి-కోడూరు:** కౌంటింగ్ జరిగూ జూన్ 4న ఎవరైనా గొడవలు చేస్తే వారిపై రౌడీ షీట్ తెరుస్తామని అవనిగడ్డ సిఐ వెంకట త్రినాథ్ అన్నారు. సోమవారం కోడూరు పోలీస్ స్టేషన్ వద్ద మండలంలోని వైసిపి, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ త్రినాథ్ మాట్లాడుతూ కోడూరు మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించారని అదేవిధంగా కౌటింగ్ సమయంలో కూడా సహకరించాలని కోరారు. ఎన్నికలు పురస్కరించుకుని ఏగ్రామంలోనైనా అల్లర్లు సష్టించిన, గొడవలు పడిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి పై రౌడీషీట్ తెరవడం జరుగుతుందని హెచ్చరించారు. కావునా ఆయా గ్రామాల్లోని యువత, పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రశాంత వాతావరణం ఉండేలా నేతలు చూడాలని సీఐ కోరారు. ఈ సమావేశంలో కోడూరు ఎస్సై పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కష్ణ విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై సంబంధిత ఎన్నికల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓట్ల లెక్కింపు కేంద్రమైన కష్ణ విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారని ఆలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు.ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల తాళం చెవులను చాలా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లేదా ఫారం 7-ఏ ప్రకారం పోటీ చేస్తున్న అభ్యర్థుల క్రమసంఖ్య చాలా జాగ్రత్తగా గమనించి వారికి పోలైన ఓట్లను సంబంధిత పట్టికలో నమోదు చేయాలన్నారు.కౌంటింగ్ హాల్లోకి ప్రవేశించే ముందు ప్రతి ఒక్కరిని భద్రత దష్ట్యా తనిఖీ చేసి లోపలికి పంపాలన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా

పర్యవేక్షించాలన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించేందుకు కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు.ఓట్ల లెక్కింపు సిబ్బంది జూన్ నెల 4వ తేదీన ఉదయం 5 గంటలకే కష్ణ విశ్వవిద్యాలయానికి చేరుకునే విధంగా ముందు రోజు వారికి మచిలీపట్నంలో వసతి గృహాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను కష్ణా విశ్వవిద్యాలయానికి తరలించడానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ఏజెంట్లతో పాటు వారి వాహనాలకు కూడా అవసరమైన అనుమతి పత్రాలను జారీ చేయాలన్నారు.గురుకుల పాఠశాల వద్ద పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ఏజెంట్లు వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలని, అలాగే పరిపాలన భవనం ముందు ఓట్ల లెక్కింపుకు హాజరయ్యే ఉద్యోగులు మీడియా వారి వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.ఓట్ల లెక్కింపుకు హాజరయ్యే ఉద్యోగులు గాని, ఏజెంట్లు గానీ ఎవరైనా సరే ఆర్టీసీ బస్టాండ్ తో పాటు కష్ణా విశ్వవిద్యాలయం దగ్గర తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాప్ నుండి ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల వరకు కష్ణా విశ్వవిద్యాలయానికి చేరుకునే విధంగా నిరంతరం నడిచేలా ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏమైనా గొడవలు జరిగితే తక్షణమే స్పందించి నియంత్రించే విధంగా పోలీసు బందాలు సిద్ధంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ , డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, అదనపు ఎస్పి జి వెంకటేశ్వరరావు, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ, పెనమలూరు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పి.వెంకటరమణ, ఎం వాణి, జి బాలసుబ్రమణ్యం, డి రాజు, పి పద్మావతి, శ్రీదేవి పలువురు నోడల్ అధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరిబాబు

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

**ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు**

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :**

కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సమావేశం దంతాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇబ్రహీంపట్నం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ 2019లో వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన సిసిఆర్‌సి చట్టాన్ని సవరించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవాలయ భూముల కౌలుదారులకు కార్డులు మంజూరు చేసి వాస్తవ కౌలుదారులు అందరికీ రాయితీలు అందజేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, పచ్చిగొట్ట విత్తనాలు నేరుగా కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, వత్సవాయి మండలం అధ్యక్షుడు కందుల జాన కోటయ్య, చందర్లపాడు మండల అధ్యక్షుడు గుమ్మల్ల ఏడుకొండలు, వీర్లపాడు మండల కార్యదర్శి చాట్ల రవి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ ఓపెన్ చదరంగం పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :**

జూనియర్స్ చెస్ అకాడమీ, ఎన్టీఆర్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ చదరంగం పోటీలు సోమవారం స్థానిక గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ సైన్సెస్ కళాశాలలో ప్రారంభమైనవి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ తాడిపత్తి కిషన్ బాబు, మెంటర్ ఎం.కృష్ణ ప్రభు చదరంగం పోటీలను ప్రారంభించారు. చదరంగం అన్ని వయసుల వారు చదరంగం నేర్చుకొని ప్రతిరోజు సాధన చేయటం వల్ల వారు చదువులోనూ జీవితంలోనూ మేధావులుగా ఉంటారని అన్నారు. రానున్న తరాలకు ఒక ధ్రువ తారల లాగా మార్గ చూపరులు అవుతారని, క్రీడాకారులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. తొలి రోజు నాలుగు రౌండ్లు ముగిసేసరికి గుంటూరు జిల్లాకు చెందిన ఉమెన్ ఫిడే మాస్టర్ ఎన్ ఎల్ వి అనూష, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఫిడే మాస్టర్ వెంకట కార్తీక్ కృష్ణ, ఎండి ఇమ్రాన్ శ్రీకాకుళం చెందిన వై.సేతు మాధవ్, ముందంజలో దూసుకు వెళ్తున్నారని చీఫ్ ఆర్బిటర్ జి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి అక్బర్ బాషా ఎం.రాజీవ్ పాల్గొన్నారు.

# 29న గురుకుల పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్లు

## జిల్లా సమన్వయ అధికారి బి.సుమిత్ర దేవి

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 29వ తేదీ బుధవారం జి. కొండూరు మండలం కుంటముక్కలలో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు స్పాట్ అడ్మిషన్స్ కొరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా గురుకుల విద్యాలయ సమన్వయ అధికారి బి. సుమిత్ర దేవి ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలల్లో సీట్ల భర్తీ కొరకు ఇప్పటికే కౌన్సిలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేసి విద్యార్థులకు ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు. పాఠశాలలకు సంబంధించి 5వ తరగతిలో ప్రవేశించే బాలికలకు బల్లిపర్రు గురుకుల పాఠశాలకు సంబంధించి ఎస్‌సి కేటగిరిలో 36, బిసి-సి కేటగిరిలో 10, బీసీ కేటగిరిలో 2, మోటూరు గురుకుల పాఠశాలలో బిసి-సి కేటగిరిలో 5, బీసీ కేటగిరిలో 1, చల్లపల్లి గురుకుల పాఠశాలలో ఓసీ కేటగిరిలో 1, ఎస్‌టి కేటగిరిలో 1, బిసి-సి కేటగిరిలో 9 సీట్లను భర్తీ చేయవలసి ఉందన్నారు. జూనియర్ ఇంటర్ బాలికల ప్రవేశం కొరకు బల్లిపర్రు గురుకుల పాఠశాలలో ఎస్‌సి కేటగిరిలో 15, ఎస్టీ కేటగిరిలో 2, బిసి-సి కేటగిరిలో 10, బీసీ కేటగిరిలో 2, జగ్గయ్యపేట గురుకుల పాఠశాలలో ఎస్‌సి కేటగిరిలో 7, ఎస్‌టి కేటగిరిలో 2, బిసి-సి కేటగిరిలో 3 సీట్లను భర్తీ చేయవలసి ఉందన్నారు. పైన తెలిపిన సీట్లను భర్తీ చేసేందుకు గాను 29వ తేదీ ఉదయం 10 గంటలనుండి కుంటముక్కల గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థినిలకు స్పాట్ అడ్మిషన్ కల్పిస్తామన్నారు. కౌన్సిలింగ్ లో పాల్గొనే విద్యార్థినిలు సంబంధించిన ధ్రువపత్రములతో కౌన్సిలింగ్ కు హాజరై స్పాట్ అడ్మిషన్ అవకాశాన్ని వినియోగించుకోవాలని సుమిత్ర దేవి ఆ ప్రకటనలో కోరారు.

# న్యూ టయోటా అర్బన్ క్రూజర్ టైసర్ కారు విడుదల

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** టయోటా కంపెనీ ఆధ్వర్యంలో న్యూ టయోటా అర్బన్ క్రూజర్ టైసర్ ఎస్‌యువి కారును ఎనికేపాడులోని లక్ష్మీ టయోటా షోరూమ్‌లో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టయోటా కార్లకు వినియోగదారుల వద్ద నుండి చక్కని ఆదరణ ఉందని విజయవాడ నగరంలో నూతన కారును ఆవిష్కరించడం శుభపరిణామమని అన్నారు. లక్ష్మీ టయోటా సిఇవో రామకృష్ణ మాట్లాడుతూ టయోటా నూతనంగా ప్రవేశపెట్టిన అర్బన్ క్రూజర్ టైసర్ కారు 1000 సిసి టర్బో పెట్రోల్, 1200 సిసి పెట్రో ఇంజన్‌లతో ఉందని తెలిపారు. కస్టమర్ల అభిరుచి మేరకు సిఎన్‌జి మోడల్‌లో 12 వేరియంట్లలో లభిస్తుందని తెలిపారు. విశాలవంతమైన ఈ కారులో 360 డిగ్రీల కెమెరా, హెడ్ అప్ డిస్‌ప్లే, 6 ఎయిర్ బ్యాగ్స్, క్రూజ్ కంట్రోల్, ట్విన్ ఎల్ఇడి డిఆర్ఎల్, ఆర్ 16 మెషీన్డ్ అల్లాయ్ వీల్స్, ఆటోహెడ్ ల్యాంప్స్ ఇంకా అనేక భద్రతా ప్రమాణాలను కలిగిఉందని తెలిపారు. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజన్ కారు 22.8 కిలోమీటర్ల వరకు మైలేజి ఇస్తుందన్నారు. ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర రూ.7.73 లక్షల నుండి 13 లక్షల వరకు ఉందని తెలిపారు. ఇది ఆకర్షణీయమైన 5 సింగిల్ టోన్, 3 డ్యూయల్ టోన్ రంగులలో లభిస్తుందన్నారు. ఈ నూతన అర్బన్ క్రూజర్ టైసర్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయని వివరాలకు ఎనికేపాడులోని షోరూమ్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ టయోటా జనరల్ మేనేజర్ అస్మతుల్లా, సర్వీస్ జనరల్ మేనేజర్ పవన్, ఎస్‌బిఐ, ఇతర ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు, కస్టమర్లు పాల్గొన్నారు.

# క్లాప్ ఆటో డ్రైవర్ల నూతన కమిటీ

**గౌరవాధ్యక్షులుగా దోనేపూడి కాశీనాథ్**

**అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శివకుమార్, కిరణ్‌బాబు**

నూతన క మిటీ సభ్యులు

**ప్రజాశక్తి - విజయవాడ :**

విజయవాడ నగర పరిధిలో ఉన్న క్లాప్ ఆటో డ్రైవర్ల నూతన కమిటీ ఏర్పడింది. సింగ్‌నగర్‌లోని కృష్ణాహోటల్ సెంటర్‌లో ఆదివారం జరిగిన క్లాప్ ఆటో డ్రైవర్ల సమావేశంలో 13 మందితో నూతన కమిటీ ఏర్పడింది. కమిటీ గౌరవాధ్యక్షులుగా దోనేపూడి కాశీనాథ్, అధ్యక్షులుగా కె శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా డి కిరణ్‌బాబు, కోశాధికారిగా రాంకుమార్ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టి.ప్రవీణ్, ఎస్.జ్యోతిబాస్ ఎన్నిక కాగా, ఐదుగురు ఉపాధ్యక్షులుగా, మరో నలుగురు సహాయ కార్యదర్శులతో కమిటీ ఏర్పడింది. ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధంగా ఏర్పడిన ఈ కమిటీ సమావేశానికి ఎస్.జ్యోతిబాస్ అధ్యక్షత వహించారు. కమిటీ ఏర్పడిన అనంతరం యూనియన్ గౌరవాధ్యక్షులు కాశీనాథ్ మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను తక్షణమే నగరపాలక సంస్థ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ నెల పెండింగ్ వేతనాన్ని వెంటనే విడుదల చేసి, సమ్మె విరమించే విధంగా నగరపాలక సంస్థ కమిషనర్, కాంట్రాక్టర్ 'స్వయంభూ' సంస్థ కాంట్రాక్టర్ చొరవ చూపాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా ప్రతి డ్రైవర్‌కు రూ. 18,500 వేతనం మంజూరు చేయడంతో పాటు ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని కోరారు. నగరపాలక సంస్థతో సంబంధం లేకుండా సదరు కాంట్రాక్టర్ క్రమం తప్పకుండా, ఆలస్యం కాకుండా వేతనాలు ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ యాజమాన్యం చెల్లించాలన్నారు. ఐడి కార్డులు, వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలన్నారు. సోమవారం రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో జరిగిన చర్చల అనంతరం వేతనాల అంశాన్ని డ్రైవర్లతో స్వయంభూ సంస్థ కాంట్రాక్టర్ మాట్లాడి, పెండింగ్ వేతనాల సమస్య పరిష్కరించే విధంగా నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్లు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# నెమలికన్నుపై ఎన్‌టిఆర్ చిత్రాలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :**

నేడు (28న) పద్మశ్రీ డాక్టర్ ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా కృష్ణుని పాత్రలో ఒదిగిపోయిన ఆయన చిత్రాన్ని నెమలికన్నుపై పట్టణానికి చెందిన చిత్రకారుడు తీర్చిదిద్దారు. మార్కర్ పెన్ను, వాటర్ కలర్స్‌తో, ఎన్టీఆర్ నటించిన చిత్రాలలోని వేషధారణలను చాట్ పేపర్‌పై పెన్సిల్ షేడ్స్‌తో చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ అద్భుతంగా తీర్చిదిద్దారు.

# సరికొత్తగా రేంజ్ రోవర్ లగ్జరీ కార్లు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** రేంజ్ రోవర్ల స్థానం చాలా ప్రత్యేకమైనదనీ, అలాంటి రేంజ్ రోవర్ బ్రాండ్ రేంజ్ రోవర్ హౌస్ ద్వారా కార్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ చీఫ్ కమర్షియల్ అధికారి లెన్నార్డ్ తెలిపారు. నగరంలోని రేంజ్ రోవర్ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇక్కడే రేంజ్ రోవర్ హౌస్‌ను ఏర్పాటు చేసి రాబోయే రోజుల్లో ఎక్స్‌క్లూజివ్, మోడ్రన్ లగ్జరీతో కూడిన కార్లను ఇక్కడే తయారు చేయబోతోందన్నారు. విలాసవంతమైన తీరప్రాంత పట్టణం అలీబాగ్‌లో రేంజ్ రోవర్ హౌస్‌ని ఏర్పాటు చేశారనీ అన్నారు. భారతదేశంలో ఉత్పత్తి చేయబడే మొదటి రేంజ్ రోవర్ స్పోర్ట్ వాహనాలు, ప్రత్యేకంగా భారతీయ మార్కెట్ కోసం రూపొందించిన కొన్ని కార్లను ఇక్కడ ప్రదర్శిస్తారన్నారు. రేంజ్ రోవర్ విలాసవంతమైన పెద్ద ఎస్‌యూవీల కోసం పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య రోజురోజుకి పెరుగుతోందన్నారు. దీంతో సొగసైన రేంజ్ రోవర్ డైనమిక్, ఆధునిక పనితీరు గల ఎస్యూవీ రేంజ్ రోవర్ స్పోర్ట్ రెండూ పూణేలో మొదటిసారిగా స్థానికంగా తయారు చేస్తారన్నారు. దీనిద్వారా వినియోగాదారులకు రేంజ్ రోవర్ అద్భుతమైన వాహనాలను తక్కువ సమయంలోనే సులభంగా అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. అన్నింటికి మించి ఆధునిక లగ్జరీ క్లయింట్ ప్రయాణాన్ని అందించే జేఎల్ఆర్ సామర్థ్యాన్ని ఇది మరింతగా విస్తరిస్తుందన్నారు. ఇప్పటికే రేంజ్ రోవర్ వెలార్, రేంజ్ రోవర్ ఎవోక్, జాగ్వార్ ఎఫ్-పేస్ డిస్కవరీ స్పోర్ట్ లను తయారు చేస్తున్నారన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి -తిరువూరు :**

జూన్ 5న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తిరువూరులో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీవసుధ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ డి.ఆనందరావు తెలిపారు. జూనియర్స్ విభాగంలో 7,8 తరగతుల విద్యార్థులకు, సీనియర్స్ విభా గంలో 9, 10 తరగతి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీనిధి జూనియర్ కళాశాల (పశువుల ఆసుపత్రి ఎదురుగా) ఉదయం 9 నుంచి పరీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివరాలకు 6302482279 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.